క్లుప్తంగా

పౌష్టికాహారం పంపిణీ



మచిలీపట్నంటౌన్: 28, 29 డివిజన్లలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్పొరేటర్లు షేక్ షాహీనా, కట్టా కేదారేశ్వరరావులు కోడిగుడ్లు, కందిపప్పు, నూనె, బాలామృతం, రాగిపిండి, ఖర్జూరం, పప్పుచెక్క, బెల్లం తదితర పదార్థాలను వారికి అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నిరవధిక సమ్మెలో ఉండటంతో సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో కేంద్రాలను నిర్వహిస్తున్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

మచిలీపట్నంటౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా ఓటు వేసే అంశంపై నగరంలోని పలు డివిజన్లలో శనివారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. 36, 34 డివిజన్లలో కార్పొరేటర్లు మాచవరపు రాంప్రసాద్, బడే నాగరేవతి ఆధ్వర్యంలో డివిజన్ ప్రజలకు ఓటు వేసే విధానంపై బూత్ లెవల్ ఆఫీసర్లు అవగాహన కల్పించారు. ప్రజలతో పాటు బూత్ లెవల్ ఏజెంట్లకు ఈవీఎంలు సరిగా పనిచేస్తున్నదీ, లేనిదీ, పనిచేస్తున్న ఈవీఎంలలో ఓటు ఎలా వేయాలి అనే అంశాన్ని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ మొహిసిన్, వైఎస్సార్ సీపీ నాయకులు దమ్ము కేశవరావు, సుంకర రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేత

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఏడో డివిజన్‌కు చెందిన దివ్యాంగుడు వంకా కృష్ణమోహన్‌కు శనివారం వీల్‌చైర్‌ను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అందజేశారు. డివిజన్ కార్పొరేటర్ పడమట రేవతి కృష్ణమోహన్ సమస్యను ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) దృష్టికి తీసుకువెళ్లడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయన వీల్‌చైర్‌ను మంజూరు చేయించారు. దీనిని కృష్ణమోహన్ ఇంటికి తీసుకువెళ్లి అందజేశారు. వీల్‌చైర్‌ను అందించిన పేర్ని కిట్టుకు కృష్ణమోహన్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ గూడవల్లి నాగరాజు, డివిజన్ ఇన్‌చార్జ్ పడమట రమేష్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చలమలశెట్టి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

పెడన: అన్ని దానాల్లో రక్త దానం చాలా గొప్పదని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి భవిరిశంకర్‌నాథ్ అన్నారు. రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణం నిలుస్తుందని చెప్పారు. మండలంలోని నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో రక్త పరీక్ష శిబిరాన్ని శనివారం నిర్వహించారు. శంకర్‌నాథ్ మాట్లాడుతూ యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలనే ఉద్దేశంతో వారిది ఏ గ్రూపు రక్తమో తెలుసుకునేందుకు, వారి చిరునామా, ఫోన్ నంబర్లు తీసుకుని ఆసక్తి ఉంటే రక్తదానం చేసేందుకు ఆహ్వానిస్తామని చెప్పారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి వ్యక్తి రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె. కుమార్‌బాబు, డైరెక్టర్ డి. బాబా, కళాశాల ప్రిన్సిపాల్ బీఆర్‌ఎస్ రెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీకే ప్రసాద్, ఆయా విభాగాధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామ స్థాయి క్రీడా పోటీలు

మోపిదేవి: గ్రామ స్థాయిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. చివరిరోజు క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ప్రభుత్వం ప్రకటించిన ఐదు రకాల క్రీడలు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, షటిల్, వాలీబాల్ పోటీలు గ్రామ స్థాయిలో ముగిశాయని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. మండల స్థాయిలో ఈనెల 19వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు. పీఈటీలు ఎం. రామకృష్ణ, కె. సత్యనారాయణ, ఎ. శ్రీహరి, ఎ. తాతాజీరావు, వైటీ గాబ్రియేలు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: సచివాలయ స్థాయిలో గత 12 రోజులుగా జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు శనివారంతో ముగిశాయని ఎంపీడీఓ జె. స్వర్ణభారతి తెలిపారు. బంటుమిల్లి, పెదతుమ్మిడి పాఠశాలల ఆవరణలో జరిగిన ఫైనల్ పోటీలతో ఆటలు ముగిశాయన్నారు. మండల స్థాయి పోటీలు ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

మచిలీపట్నంటౌన్: నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల జేఏసీ ముద్రించిన డైరీ, క్యాలెండర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జి. గీతాబాయి శనివారం ఆవిష్కరించారు. జేఏసీ జిల్లా చైర్మన్ చిట్టూరి ప్రవీణ్ కుమార్, చిలకలపూడి, పెడన, గిలకలదిండి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లతో కలిసి ఆమె వీటిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గోపి, ప్రసాద్, వలీ, రఘు, అరుణసుధ, మురళి పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం జగనన్నతోనే సాధ్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక
- కొత్తపాలెంలో గ్రామ సచివాలయ భవనం ప్రారంభం



మెరకనపల్లిలో పీఏసీఎస్ భవనం ప్రారంభించిన ఉప్పాల హారిక, తాతినేని పద్మావతి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తదితరులు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వలంటీర్లు

కె. కొత్తపాలెం(మోపిదేవి): పరిపాలనా వికేంద్రీకరణతో గ్రామ స్వరాజ్య స్థాపన జరిగిందని ఉమ్మడి కృష్ణా జిల్లా చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. మండల పరిధి కె. కొత్తపాలెంలో శనివారం రూ. 43.60 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుతో కలిసి ఆమె ప్రారంభించారు. హారిక మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపన సీఎం వైఎస్ జగనన్నతో సాధ్యమైందన్నారు. సీఎం జగనన్న పాలనలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చారని చెప్పారు. తొలుత వంగవీటి రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రైతుల పక్షపాతి జగనన్న..

కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తాతినేని పద్మావతి మాట్లాడుతూ రైతాంగానికి అండగా ఉంటూ రైతు పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని చెప్పారు. మెరకనపల్లిలో రూ. 22.15 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ భవనాన్ని, గోడౌన్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల బీమాకు చెల్లించే ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. పంట నష్టపోతే అదే ఏడాది రైతుకు నష్ట పరిహారం అందిస్తోందని, పెట్టుబడి సాయంగా ప్రతి ఏడాది రైతుకు రూ. 13,500 అందిస్తూ అండగా నిలుస్తోందని చెప్పారు. 425 సొసైటీల ద్వారా సుమారు 11 వేల కోట్లకు పైగా టర్నోవర్ జరుగుతోందని వివరించారు. ఆప్‌కాబ్ సంస్థకు చెందిన భవనం ఆస్తులను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయ కారణాలతో తెలంగాణకు వదిలిపెట్టి పారిపోయి ఆంధ్రాకు వచ్చారని విమర్శించారు. ప్రజలకు అండగా ఉంటున్న ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి గెలిపించుకోవాలని కోరారు.

కొక్కిలిగడ్డలో గోడౌన్ ప్రారంభం

రైతులు పండించిన పంటను నిల్వ చేసుకునేందుకు గోడౌన్ అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని కొక్కిలిగడ్డలో రూ. 45 లక్షల నాబార్డు నిధులతో నిర్మించిన గోడౌన్‌ను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని మెరకనపల్లి గ్రామంలో అసంపూర్తిగా నిలిచిన పంచాయతీ భవనాన్ని సర్పంచ్ యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మితో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ప్రారంభించారు. గతంలో నిలిచిపోయిన భవనానికి రాష్ట్ర ప్రభుత్వంలో ఎమ్మెల్యే రమేష్‌బాబు సహకారంతో సీఎండీఎఫ్ నిధులు రూ. 5 లక్షలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 10 లక్షలు, పంచాయతీ నిధులు రూ. 1.60 లక్షలు మొత్తం రూ. 16.60 లక్షలతో పంచాయతీ భవనం పూర్తి చేసినట్లు గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు ముత్యాల వరలక్ష్మి, రెడ్రౌతు వెంకట రమణ, రావి రాంప్రసాద్, ఆదిరాంబాబు, తుటారం కృష్ణ, ఎంపీడీఓ కె. శ్రీనివాసరావు, ఎంపీటీసీలు సనకా వెంకట రాజేష్‌బాబు, మత్తి లత, సచివాలయ మండల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరరావు, బీసీ మండల కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు, చోడాబత్తిన పూర్ణచంద్రరావు, మత్తి రాజాచంద్, పలు శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం..

పేదల సాదక బాధలు తెలిసిన ముఖ్యమంత్రి జగనన్నను ఎన్నటికీ మరువలేమని వలంటీర్లు తాతా మణికంఠ, బుర్రె రాజవంశీ అన్నారు. ఇటీవల వలంటీర్లకు నెలకు మరో రూ. 750లు పెంచడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కె. కొత్తపాలెంలో వలంటీర్ల ఆధ్వర్యంలో శనివారం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముఖ్యమంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

రాజశేఖరస్వామి హుండీ ఆదాయం రూ.1.54 లక్షలు

అవనిగడ్డ: స్థానిక రాజశేఖరస్వామి ఆలయ హుండీ కానుకలను ఆలయ ప్రాంగణంలో శనివారం లెక్కించారు. పది నెలల కాలానికి గాను రూ. 1,54,102 ఆదాయం లభించిందని ఆలయ ఇన్‌చార్జి అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. గత ఏడాది సంవత్సర కాలానికి రూ.1,54,682 ఆదాయం వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గార్లపాటి గోపి, పరిశె రామారావు తదితరులు పాల్గొన్నారు.

పల్లెపాలెం హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు



కృత్తివెన్ను: సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాధాన్యతను విద్యార్థి దశ నుండే చిన్నారులకు తెలియజేయాలని ఉపాధ్యాయుడు కె. సూర్యప్రకాష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పల్లెపాలెం ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రకరకాల రంగవల్లులను అందంగా తీర్చిదిద్దారు. భోగి మంటలు, డూడూబసవన్నల విశేషాలు, భోగిపండ్ల ప్రాముఖ్యత, పిండివంటలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి స్థానిక సర్పంచ్ కొల్లాటి రాజు చేతుల మీద బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

మచిలీపట్నంటౌన్: 40వ డివిజన్ కాసానిగూడెంకు చెందిన దేవరపల్లి వెంకటరమణ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. ఆమెకు వైఎస్సార్ బీమా పథకం మంజూరైంది. తక్షణ సాయం కింద రూ. 10 వేలను మృతురాలి కుమార్తె కన్యాకుమారికి శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ గోళ్ల పాండురంగ, కన్వీనర్లు తరకటూరి సీతారాం, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

గూడూరు: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి కె.రాజ్యలక్ష్మి అన్నారు. గూడూరులోని 32వ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికలలో గూడూరులోని 32వ పోలింగ్ కేంద్రంలో అత్యంత తక్కువగా పోలింగ్ శాతం నమోదైందన్నారు. ఓటు ప్రాముఖ్యతను ప్రజలు గుర్తించాలని చెప్పారు. పోలింగ్ శాతం తగ్గడానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగేలా ఓటర్లను చైతన్య చేయాలని ఆమె స్థానిక అధికారులను సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.విజయప్రసాద్, వీఆర్వో షేక్ కరీముల్లా, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తేజేష్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డిమందు తాగిన వ్యక్తి మృతి

పెడన: మద్యం సేవించి ఇంటికి రావడమే కాకుండా భార్య మందలించిందని గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంకేపూడి గ్రామానికి చెందిన శలపాటి రామకృష్ణ (43) ఈ నెల నాలుగో తేదీన మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. అతనిని భార్య దుర్గాభవాని మందలించడంతో అలిగి బయటకు వెళ్లిపోయాడు. అరగంట గడిచిన తరువాత ఇంటికి వచ్చి వాంతులు చేసుకున్నాడు. భార్య గమనించి ఏమిటని ప్రశ్నించింది. దీంతో గడ్డిమందు తాగినట్లు చెప్పాడు. వెంటనే రామకృష్ణను మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. భార్య దుర్గాభవాని ఫిర్యాదు మేరకు పెడన పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. రామకృష్ణ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

అభివృద్ధి చేశాం.. అండగా నిలవండి



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి జోగి రమేష్

- మంత్రి జోగి రమేష్
- చెన్నూరులో గడపగడపకు మన ప్రభుత్వం

పెడన: రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలిచి మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మండల పరిధిలోని చెన్నూరు గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి తనయుడు జోగి రాజీవ్ చెన్నూరు గ్రామంలో మరో పక్క గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు మీ వద్దకు వచ్చామని చెప్పారు. చెన్నూరు గ్రామ సచివాలయం పరిధిలో 440 మందికి ప్రతి నెలా ఒకటో తేదీన రూ.13 లక్షలను పింఛన్ల రూపంలో అందజేస్తున్నామని చెప్పారు. ఈ నెల నుంచి రూ.3 వేలకు పింఛను పెంచామన్నారు. 219 మందికి జగనన్న అమ్మఒడి కింద రూ.28.47 లక్షలు, రైతు భరోసా ద్వారా 984 మంది రైతులకు రూ.1.33 కోట్లు, వైఎస్సార్ చేయూత ద్వారా 129 మంది లబ్ధిదారులకు రూ.24.18 లక్షలు, వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 698 మందికి రూ.69.36 లక్షలు, జగనన్న విద్యా దీవెన ద్వారా 76 మందికి, 74 మందికి జగనన్న వసతి దీవెన, 87 మందికి కాపు నేస్తం తదితర పథకాల కింద నాలుగున్నరేళ్లలో ప్రత్యక్ష నగదు బదిలీ కింద లబ్ధి చేకూరిందని వివరించారు. గత నాలుగున్నరేళ్లుగా గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి వివరించారు. నాడు-నేడు ద్వారా పాఠశాల అభివృద్ధికి రూ.11 లక్షలు, గ్రామ సచివాలయ నిర్మాణానికి రూ.40 లక్షలు, రోడ్లకు రూ.30 లక్షలు వ్యయం చేశామన్నారు. చెన్నూరు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి జల్‌జీవన్ మిషన్ కింద చెన్నూరుకు రూ.50 లక్షలు, దళితవాడకు రూ.43 లక్షలు, తాళ్లచెరువుకు రూ.10 లక్షలు, గొల్లగూడెంకు రూ.30 లక్షలు మంజూరయ్యాయన్నారు. త్వరలో ప్రతి ఇంటికి కుళాయిలు మంజూరు చేస్తామన్నారు. గ్రామంలో అక్కడక్కడా రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని మంత్రిని కోరారు. విద్యుత్ స్తంభాలు, వీధి లైట్లు, సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజులపాటి వాణి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గరికిపాటి చారుమతి, వైస్ ఎంపీపీ యాదంరెడ్డి వరప్రసాద్, మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, నాయకులు అచ్యుతరావు, రామానాయుడు, ఎంపీటీసీ కాటం నాగమణి, ఎంపీడీఓ వి. రెడ్డయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి డీఈ హేమ స్రవంతి, పంచాయతీ రాజ్, హౌసింగ్, విద్యుత్, రెవెన్యూ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఊంజల సేవ

ముగిసిన పైడమ్మ జాతర మహోత్సవాలు



పైడమ్మ అమ్మవారి ఊంజల సేవ

పెడన: పట్టణంలోని పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం ఉదయం అమ్మవారి ఊంజల సేవతో ముగిశాయి. శుక్రవారం అర్ధరాత్రి పైడమ్మ అమ్మవారి గ్రామోత్సవం పెడన పట్టణంలో నిర్వహించారు. తొలుత అత్తింటి వారైన దాసు ఇంటి వారు మహా నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. పైడమ్మ (ఉత్సవ విగ్రహం) అమ్మవారు అత్తింటి వారింటికి బయల్దేరి వెళ్లి వడిమాల కట్టించుకుని మేళతాళాలతో పైడమ్మ సోదరుడు పోతురాజు ఆలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి పుట్టింటి వారైన తోట వారింటికి వెళ్లి వడిమాల కట్టించుకుని ఘటం గుడికి చేరుకుని ప్రత్యేక పూజలందుకున్నారు. అనంతరం పైడమ్మ అమ్మవారు గ్రామోత్సవానికి బయల్దేరి శనివారం ఉదయం 9 గంటలకు ఆలయ ప్రవేశం చేశారు. దేవదాయ శాఖాధికారి, ఈఓ టీవీవీ మోహనరావు, ఆలయ ఆసాది లీలాప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, వార్డు కౌన్సిలర్ పద్మావతి, భక్తులు అమ్మవారి ఊంజల సేవలో పాల్గొన్నారు. అమ్మవారిని ఊయలలో కూర్చుండబెట్టి ఊయలను ఊపారు. అనంతరం అమ్మవారిని గర్భాలయంలోకి తీసుకువెళ్లగానే అమ్మవారు ఊగిన ఊయలలో చిన్నారులను పడుకోబెట్టి ఊయలను ఊపి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

12న అన్నసమారాధన..

ఈ నెల 12వ తేదీన భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామని ఆలయ ఈఓ మోహనరావు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు విచ్చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

సీఎం జగన్, పేర్ని కిట్టును ఆశీర్వదించండి

మేయర్ వెంకటేశ్వరమ్మ



వృద్ధురాలితో మాట్లాడుతున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: ఎమ్మెల్యే పేర్ని నానిని ఆశీర్వదించినట్లుగానే వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)ను కూడా ఆశీర్వదించాలని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ ప్రజలను కోరారు. 43వ డివిజన్‌లో శనివారం ఆమె విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పేర్ని కిట్టును పార్టీ అధిష్టానం ఇటీవల నియమించిందన్నారు. రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. వైఎస్సార్ సీపీ డివిజన్ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని 27వ డివిజన్‌లో షేక్ అచ్చెబా, 8వ డివిజన్‌లో కార్పొరేటర్ శ్రీరాం చిన్నా ఇంటింటికి వెళ్లి పేర్ని కిట్టును దీవించాలని ప్రజలను కోరారు.

వ్యాన్ ఢీకొని ఆబోతు మృతి

డ్రైవర్‌కు గాయాలు



ఆబోతు మృతదేహం

బంటుమిల్లి: అర్తమూరు పంచాయతీ శివారు 10వ మైలురాయి వద్ద 216 జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి వ్యాన్ ఢీకొనడంతో ఆబోతు మృతిచెందింది. స్థానికుల సమాచారం ప్రకారం.. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో బంటుమిల్లి వైపు నుంచి పెడన వైపునకు వేగంగా వెళుతున్న వ్యాన్ ఎదురుగా వస్తున్న ఆబోతును గమనించకుండా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆబోతు తలకు తీవ్ర గాయమై రోడ్డుపై పడిపోయింది. వ్యాన్ ముందు భాగం దెబ్బతినగా డ్రైవర్ అందులో ఇరుక్కుపోయాడు. స్థానికులు శ్రమించి డ్రైవర్‌ను బయటకు తీసి చికిత్స నిమిత్తం బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతిచెందిన ఆబోతును రోడ్డు పక్కకు చేర్చారు. కంచడం గ్రామానికి చెందిన ఆబోతు సుమారు పదేళ్లుగా అర్తమూరు ప్రాంతంలోనే తిరుగుతోందని స్థానికులు చెప్పారు. ఆబోతు మృతి సమాచారం కంచడం గ్రామస్తులకు తెలపడంతో పొక్లెయిన్ సాయంతో ఆబోతు మృతదేహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి సంప్రదాయంగా పసుపు, కుంకుమ చల్లి, హారతులు ఇచ్చి కంచడం గ్రామంలో ఊరేగించి ఖననం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ గంధం శేషగిరి, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

అన్నివర్గాలకు సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కె. కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కె. కొత్తపాలెంలో వన్‌టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం కింద 260 మందికి రుణ విముక్తి పట్టాలు అందజేశారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందన్నారు. ప్రభుత్వ పథకాలను వివరించి మరోసారి సీఎం జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, ఎంపీడీఓ కె. శ్రీనివాసరావు, మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, గ్రామ కన్వీనర్ మత్తి వెంకట రాజాచంద్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ తుటారం కృష్ణ, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి కాలువలు కలుషితం కాకుండా చర్యలు

కృత్తివెన్ను: తాగునీటికి ప్రధాన వనరులైన కాలువలను కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల పనితీరుపై ఎంపీపీ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పంటకాలువలోకి ఎగువ ప్రాంతాల్లో కోళ్లు, జంతు కళేబరాలతో పాటు ఇతర కలుషిత పదార్థాలను వేయడం వల్ల నీరు కలుషితమవుతోందన్నారు. ఇటువంటి వాటిని నిరోధించేందుకు సర్పంచ్‌లు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. జెడ్పీటీసీ మైల రత్నకుమారి, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీఓ పిచ్చిబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

కోడూరు: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని కోడూరు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివార్లకు తిరుమంజనసేవ జరిగింది. మహిళలు సామూహిక కుంకుమార్చన చేసి ఉత్సవమూర్తులకు నవహారతులు అందించారు.

జాతీయ పోటీలకు విద్యార్థిని ఎంపిక



అవనిగడ్డ: జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాల విద్యార్థిని కొప్పనాతి రిషిత ఎంపికైందని కరస్పాండెంట్ దుట్టి ఉమామహేశ్వరరావు తెలిపారు. కళాశాలలో రిషిత అభినందన కార్యక్రమం శనివారం జరిగింది. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రిషిత ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు రాజస్థాన్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తదితరులు రిషితను అభినందించారు.

వక్కలగడ్డలో విషాదం

వక్కలగడ్డ(చల్లపల్లి): గ్రామానికి చెందిన నడకుదురు రవితేజ (27) మచిలీపట్నం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటనతో వక్కలగడ్డలో విషాదం నెలకొంది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన నడకుదురు సువార్తమ్మకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రవితేజ ఎంబీఏ చదువుకుని మచిలీపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్నాడు. రవితేజ సోదరుడు కూడా చల్లపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్నాడు. పెద్ద కొడుకు మృతితో సువార్తమ్మ కుటుంబంలో తీవ్ర విషాదం అలముకుంది.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



పెడన: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, అప్పుడే మంచి ఫలితాలు సాధించగలరని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు, పెడన మున్సిపల్ మాజీ చైర్మన్ బండారు ఆనంద ప్రసాద్ అన్నారు. శ్రీ బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమానికి శనివారం ఆనందప్రసాద్ ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి మార్కులతో విజయం సాధించాలని, తద్వారా కళాశాలకు, మీ కుటుంబాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లైబ్రరీ సైన్స్ అధ్యాపకుడు పేరిశెట్టి నాగరవి, కాలెపు సూరిబాబు, ఆకురాతి జనార్దన్, తాళ్ల బాలాజీ, బళ్ల సాంబశివరావు, శంకర్రావు, ఆశపు సముద్రేశ్వరరావు, విజయ్, రాజ్యలక్ష్మి, గంగాధర్, మధులత, విద్యార్థులు పాల్గొన్నారు.